తప్పుడు కేసులు పెట్టడం మానుకోవాలి

- మాజీ మంత్రి హరీశ్‌రావుపై ఫోన్ ట్యాపింగ్ కేసును కొట్టివేయడంపై బీఆర్ఎస్ నాయకుల సంబురాలు

జహీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సంబురాలు జరుపుకొంటున్న బీఆర్ఎస్ నాయకులు

జహీరాబాద్, మార్చి 20 : మాజీ మంత్రి హరీశ్‌రావుపై కాంగ్రెస్ సర్కార్ అక్రమంగా నమోదు చేసిన ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు కొట్టివేయడం పట్ల జహీరాబాద్ పట్టణ, మండల బీఆర్ఎస్ నాయకులు సంబురాలు జరుపుకొన్నారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ నేత, మాజీ కౌన్సిలర్ నామా రవికిరణ్ ఆధ్వర్యంలో పటాకులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. ప్రతిపక్షాలపై కక్ష సాధించేందుకు కేసులు పెట్టి వేధించాలనుకునే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది ఒక గుణపాఠమన్నారు. కేసును హైకోర్టు కొట్టివేయడం విషయం తెలుసుకుని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు యూసూఫ్, బండిమోహన్, యాకుబ్, మోహిజొద్దీన్, అబ్దుల్లా, ప్రభుయాదవ్, తులసీదాస్ గుప్తా, ఖలీం, అలీమ్, మంజుల, పరమేశ్వర్ పాటిల్, వెంకటేశం, అశమ్, పద్మజా, నరేశ్ రెడ్డి, సందీప్‌రెడ్డి, వహీద్, నిఖిల్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి హరీశ్‌రావుకు స్వీట్ తినిపిస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

ఎస్సీ వర్గీకరణ ఆమోదంపై సంబురాలు

గుమ్మడిదల, మార్చి 20 : అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై ఆమోదం పొందడంతో మాదిగ దండోరా సభ్యులు పెద్ద ఎత్తున విజయోత్సవ సంబురాలు చేసి హర్షం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని కానుకుంటలో మాదిగదండోరా సభ్యులు,ఎమ్మార్పీఎస్ నాయకులు సంయుక్తంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు నక్క వెంకటేశ్‌గౌడ్, పలుగు గోవర్ధన్‌రెడ్డి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

కానుకుంటలో సంబురాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ సభ్యులు

ఇండ్లను క్రమబద్ధీకరించాలి

జిన్నారం, మార్చి 20 : జీవో59కింద డబ్బులు చెల్లించిన వారి నివాసాలను క్రమబద్ధీకరించాలని బాధితులు కోరారు. గురువారం తహసీల్దార్ భిక్షపతిని మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, పలువురు జీవో 59 బాధితులు కలిసి వినతిపత్రం అందజేశారు. 2016-21వరకు మూడు పర్యాయాలు జీవో 59 కింద నివాసాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులు చేసి నిర్దేశిత డబ్బులు కూడా చెల్లించినట్లు తెలిపారు. అధిక సంఖ్యలో వంద, యాభై శాతం డబ్బులను చెల్లించినా క్రమబద్ధీకరణ జరగలేదని, తమకు న్యాయం చేయాలని కోరారు. దీనికి స్పందించిన తహసీల్దార్ ప్రభుత్వం నివాసాల క్రమబద్ధీకరణ అంశంపై ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

రామచంద్రాపురం, మార్చి 20 : రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్‌లోని జవహర్‌నగర్‌కాలనీకి చెందిన రవితేజ (35) పటాన్‌చెరులోని గ్లాన్డ్‌ఫార్మా పరిశ్రమలో ఉద్యోగి. ఏడాదిన్నర కింద నెల్లూరుకు చెందిన ప్రత్యూషతో వివాహం జరిగింది. గురువారం ఉదయం ఎలక్ట్రిక్ స్కూటీపై డ్యూటీకి వెళ్తున్న క్రమంలో ఆర్సీపురంలోని జాతీయ రహదారిపైన రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూం సమీపంలో వెనుకాల నుంచి అతివేగంగా వచ్చిన టిప్పర్ స్కూటీని ఢీకొట్టింది. రవితేజ అక్కడిక్కడే మృతిచెందాడు. టిప్పర్ డ్రైవర్ ఆపకుండా ముందుకు వెళ్తున్న క్రమంలో స్థానికులు టిప్పర్‌ను అడ్డుకొని పోలీసులకు అప్పగించా రు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అధ్వానంగా మున్సిపాలిటీ సేవలు

పటాన్‌చెరు, మార్చి 20 : తెల్లాపూర్ మున్సిపాలిటీ సేవలు అధ్వానంగా మారాయని ముత్తంగి బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రామకృష్ణ ముదిరాజ్ అన్నారు. గురువారం పటాన్‌చెరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెల్లాపూర్ మున్సిపాలిటీ విభాగం అధికారులు, సిబ్బంది ముత్తంగిలో వారంలో ఒకరోజు కూడా చెత్తను తొలిగించడంలేదన్నారు. నాలుగు రోజులుగా చెత్తను ఎత్తకపోవడంతో గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోయిందన్నారు. వీధుల్లో దుర్వాసన వ్యాప్తి చెందుతున్నదన్నారు. మండు వేసవిలో తాగునీరు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. త్వరలో గ్రామస్తులతో కలిసి ఖాళీ బిందెలతో మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామని రామకృష్ణ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- మరో నలుగురికి తీవ్రగాయాలు

జహీరాబాద్, మార్చి 20 : రంజాన్ కోసం షాపింగ్ చేసేందుకు ముంబయికి వెళ్లి వస్తుండగా కారు డివైడర్‌కు ఢీ కొన్నది. ఈ సంఘటనలో డ్రైవింగ్ చేస్తున్న యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందగా, మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన జహీరాబాద్ పట్టణ సమీపంలోని పాత ఆర్టీవో కార్యాలయ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. జహీరాబాద్ ఎస్సై కాశీనాథ్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన ఐదుగురు యువకులు కలిసి రంజాన్ షాపింగ్ కోసం ముంబయికి వెళ్లారు. అక్కడ షాపింగ్ చేసుకుని గురువారం ముంబయి నుంచి మహబూబ్‌నగర్‌కు కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ముంబయి-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారు డ్రైవింగ్ చేస్తున్న ఖాజా ఫరీదుద్దీన్ తీవ్రగాయాలుకాగా, జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. మృతుడి బావ వాయిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జహీరాబాద్ ఎస్సై కాశీనాథ్ పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాల పరిశీలన

హత్నూర, మార్చి 20 : హత్నూర మండలం బోర్పట్ల శివారులోని అరబిందో ఫార్మా పరిశ్రమ ఆవరణలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న నిర్మాణ పనులను గురువారం డీఎల్‌పీవో అనిత పరిశీలించారు. పరిశ్రమ యాజమాన్యం గ్రామ శివారులోని కంసానికుంట, న్యారటివాని కుంట కబ్జాకు పాల్పడటంతోపాటు పంచాయతీ ప్రధానరోడ్డుపై పుట్‌పాత్ నిర్మాణం చేపట్టడంపై గ్రామస్తులు జిల్లా అధికారులకు ఇచ్చిన ఫిర్యాదుతో వాటిని పరిశీలించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. ఎంపీవో యూసూఫ్, కార్యదర్శి రాకేశ్‌కుమార్, గ్రామస్తులు మల్లేశం, ఆంజనేయులు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు

- జిల్లాలో 122 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- పరీక్షలు రాయనున్న 22,423 మంది విద్యార్థులు
- పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 20 : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 21న ప్రారంభమై ఏప్రిల్ 3 తేదీ వరకు జరగనున్నాయి. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో మొత్తం 122 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఎక్కడ కూడా సమస్యాత్మక కేంద్రాలు లేవని అధికారులు స్పష్టం చేశారు. పరీక్షల నిర్వాహణకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు 122 సిట్టింగ్ స్క్వాడ్, 6 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షలను పర్యవేక్షించనున్నాయి.హాల్ టికెట్ అందనివారు, లేదా పోగొట్టుకున్న విద్యార్థులు www. bse.telanagana. gov.in వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 122 పరీక్షా కేంద్రాల్లో 22,423 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 22,411 మంది, ప్రైవేటు విద్యార్థులు 12 మంది మొత్తం 22,423 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ముఖ్యంగా పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా 084 55-276255, 891 9677495 నెంబర్లపై సంప్రదించవచ్చు.

మనూరులో పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

పాలు పారబోసి పాడి రైతుల నిరసన

- ఆదుకోవాలని జహీరాబాద్ ఆర్డీవోకు వినతి

జహీరాబాద్ పట్టణంలోని పాలు పారబోసి నిరసన తెలుపుతున్న జహీరాబాద్ ప్రాంత పాడి రైతులు

జహీరాబాద్, మార్చి 20 : జహీరాబాద్ పట్టణంలో పాడి రైతులు నిరసన ర్యాలీని నిర్వహించారు. గురువారం స్థానిక పట్టణంలోని ప్రధాన రహదారిపై పాలను పారబోసి వినూత్నంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు పాడి రైతులు మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో పలు పరిశ్రమలు ఉన్న ఇక్కడ రైతుల నుంచి పాలను సేకరించకుండా ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నారన్నారు. పట్టణంలోని విజయడైరీలో పాలను పోస్తున్న వ్యాట్ పేరిట డబ్బులను తక్కువ చెల్లిస్తూ అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజు పట్టణంలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చల విడిగా వ్యాన్లలో పాల ప్యాకెట్ల తీసుకువచ్చి విక్రయిస్తూ వాటిలో ప్రజలు ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారని, నకిలీ పాల విక్రయాలను అరికట్టేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొగుడంపల్లి మండలంలోని హటాన్స్ పరిశ్రమ పాడి రైతుల నుంచి పాలను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీతో ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఆర్డీవో రాంరెడ్డికి పాడి రైతులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

బ్లాక్ స్పాట్లను గుర్తిస్తున్న డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి

జహీరాబాద్, మార్చి 20 : జహీరాబాద్ పట్టణ సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముంబాయి-హైదరాబాద్ జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణ సర్కిల్ పరిధిలోని జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న చోట బ్లాక్ స్పాట్లను జాతీయ రహదారుల సంస్థ అధికారులతో కలిసి గుర్తించారు. ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ పేర్కొన్నారు. ఆయన వెంట పట్టణ సీఐ శివలింగం, ఎస్సై కాశీనాథ్, రూరల్ ఎస్సై ప్రభాకర్‌రావు, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డును రద్దు చేయాలి

- నేడు 13 గ్రామాల్లో డంపింగ్‌యార్డు రద్దుకు ప్రజాబ్యాలెట్ ఓటింగ్

రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు

గుమ్మడిదల, మార్చి 20 : డంపింగ్ యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ) నుంచి మన ప్రాంతాన్ని రక్షించుకుందామని నర్సాపూర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఎర్రగొల్ల మురళీ యాదవ్ ప్రజలకు పిలుపు నిచ్చారు. గురువారం గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో ప్యారానగర్ డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న 44వ రోజు రిలే నిరాహారదీక్షలో శాలివాహన సంఘం సభ్యులు దీక్ష చేపట్టారు. దీనికి నర్సాపూర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మురళీయాదవ్ రైతు జేఏసీ నాయకులతో కలిసి సంఘీభావం తెలిపారు. ఢిల్లీలో కేంద్ర అటవీశాఖ డైరెక్టర్ జనరల్ అధికారి సుశీల్ కుమార్ అవస్తిని, కేంద్ర అటవీశాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌లను కలిసి వినతి పత్రాలను అందజేసినట్లు ఆయన తెలిపారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.గుమ్మడిదల రిలే నిరాహారదీక్షకు మద్దతుగా శాలివాహన సంఘం సభ్యులు రూ.5 వేలు విరాళం అందజేశారు. జేఏసీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, పలుగు గోవర్ధన్ రెడ్డి, చిమ్ముల నర్సింహారెడ్డి, తులసిదాసు, రాం రెడ్డి, సంజీవరెడ్డి, దేవేందర్‌రెడ్డి, మంద భాస్కర్‌రెడ్డి,పి. శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ఈశ్వరయ్య, కుమ్మరి ఆంజనేయులు, మన్నె రామకృష్ణ, కొరివి సురేశ్, రాజు గౌడ్. కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు 13గ్రామాల్లో ప్రజాబ్యాలెట్

రైతు జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో మండలంలోని 13 గ్రామపంచాయతీల్లో ప్రజాబ్యాలెట్ ఓటింగ్ చేపట్టనున్నట్లు రైతు జేఏసీ అధ్యక్షుడు చిమ్ముల జేపాల్‌రెడ్డి తెలిపారు. రిలే నిరాహారదీక్షలకు ప్రభుత్వం స్పందించక పోవడంతో నేడు ప్రజాబ్యాలెట్ ఓటింగ్ చేపట్టనున్నారు.

నందికందిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

నందికందిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

సదాశివపేట, మార్చి 20 : మండల పరిధిలోని నందికందిలో గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత మాజీ సర్పంచ్ కుందెనరాజు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకుడు వరుణ్‌కుమార్, ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ నాయకుడు యాదయ్య, సదాశివపేట మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతాగోపాల్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, నాయకులు ప్రకాశ్‌గౌడ్, దుర్గా ప్రసాద్, కొండాపురం జగన్, రామరావు, ముప్పారం ప్రకాశ్, నందకిశోర్, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ వల్లూరు క్రాంతి

విద్యార్థులకు కండ్ల అద్దాలను అందజేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 20 : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు చేపట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన రోడ్డు భద్రతా జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ, వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పీడ్ గన్ తనిఖీలు క్రమం తప్పకుండా ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలన్నారు. రోడ్డు భద్రతా, నిబంధనలపై కచ్చితంగా పాటించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎస్పీ పారితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ మాధురి, అదనపు ఎస్పీ సంజీవరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దృష్టి లోపం విద్యార్థులకు మెరుగైన చికిత్స

విద్యార్థుల దృష్టిలోప సమస్యలకు మెరుగైన చికిత్స అందించనున్నట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. ఆర్‌బీఎస్‌కే ద్వారా పాఠశాల విద్యార్థులకు కండ్ల అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని సంగారెడ్డిలోని మహాత్మ జ్యోతి భాపూలే గురుకుల పాఠశాలలో కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 4396 మంది దృష్టిలోపం గల విద్యార్థులను గుర్తించామన్నారు. మొదటి విడతలో 3426 మందికి నాణ్యమైన కండ్లఅద్దాల పంపిణీ చేపట్టామని, త్వరలో మిగతా 970 మంది విద్యార్థులకు కండ్ల అద్దాలు అందించనున్నామన్నారు. జిల్లాలో 9 బృందాల ద్వారా కంటి పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గాయత్రీదేవి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బహుమతుల ప్రదానం

క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో క్రీడా విజేతలకు కలెక్టర్ బహుమతులను అందజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని టీఎన్‌జీవో సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 5,6వ తేదీల్లో నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొని గెలిచిన వివిధ శాఖల మహిళా ఉద్యోగులకు కలెక్టర్ బహుమతులను అందజేశారు. టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఎండీ జావెద్ అలీ, కార్యదర్శి రవి, నాయకులు, వివిధ శాఖల మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించాలి

సంగారెడ్డి జిల్లాలో ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించేందుకు స్థానిక పార్టీల ప్రతినిధులు అవసరమైన సహకారాన్ని అందించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రతి మూడు నెలలకు ఒకసారి జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన

అందోల్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించేందుకు, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకానికి సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రోన్ ఆపరేటివ్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించిన కలెక్టర్

అందోల్, మార్చి 20 : ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వ కృషిచేస్తున్నదని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం అందోల్ డీఆర్డీఏ ద్వారా నిర్వహిస్తున్న డ్రోన్ ట్రైనింగ్ సెంటర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. డ్రోన్ల వాడకంతో వ్యవసాయంలో పెట్టుబడులు సైతం తగ్గుతాయని మందులను స్ప్రే చేసేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మహిళలు ట్రైనింగ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో పాండు, ఏపీఎం మాణిక్యం, అధికారులు పాల్గొన్నారు.

ఇంద్రేశంలో అక్రమ నిర్మాణంపై కొరడా

పటాన్‌చెరు, మార్చి 20 : ఇంద్రేశంలో అక్రమ అంతస్తులు నిర్మిస్తున్న బిల్డింగ్‌పై పంచాయతీ అధికారి కొరడా ఝుళిపించారు. గురువారం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామ పరిధిలో అక్రమంగా నాలుగు అంతస్తులపైన నిర్మిస్తున్న శ్రీధర్‌రెడ్డి అనే వ్యక్తి నిర్మాణం స్లాబ్‌ను గ్రామ కార్యదర్శి సుభాశ్ ఆధ్వర్యంలో పంచాయితీ సిబ్బంది కూల్చివేశారు. స్లాబ్ కటింగ్ మెషిన్‌తో స్లాబ్‌ను కట్ చేసి తొలిగించారు. పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంద్రేశంలో నాలుగో అంతస్తు స్లాబ్‌ను తొలిగిస్తున్న పంచాయితీ సిబ్బంది

అక్రమ నిర్మాణాలపై గ్రామస్తుల ఫిర్యాదు

జిన్నారం, మార్చి 20 : జిన్నారం మండలం శివనగర్‌లోని ఉప్పరివానికుంట శిఖంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని రైతులు, గ్రామస్తులతో కలిసి జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం కుంట శిఖంలో అక్రమ నిర్మాణాలు చేపట్టడంపై ఇరిగేషన్ పోలీస్ రెవెన్యూ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై ఇరిగేషన్ ఏఈ ప్రసాద్ గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎస్సై నాగలక్ష్మితో కలిసి అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. టీఎస్ ఐపాస్‌కు కేటాయించిన స్థలాల్లోనే నిర్మాణాలు చేపడుతున్నామని పారిశ్రామికవేత్తలు చెబుతున్నారు. ఆయా శాఖల అధికారులు పరిశీలించిన తర్వాత రెండు రోజుల్లో ఈ వ్యవహారంపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో సమగ్ర విచారణ జరిపి తగు విధంగా చర్యలు తీసుకుంటామని అప్పటి వరకు పనులు నిలిపివేయాలని ఇరిగేషన్ అధికారులు సూచించారు. మాజీ సర్పంచ్ రేఖాకృష్ణ, మాజీ వాడి సభ్యులు శ్రీను, ఆంజనేయులు, మహేశ్ గౌడ్, నర్సింహులు, రైతులు పాల్గొన్నారు.

కోహీర్‌లో 20 మందిపై కుక్క దాడి

కోహీర్, మార్చి 20 : కోహీర్ పట్టణంలోని పలు కాలనీల ప్రజలపై గురువారం రాత్రి పిచ్చికుక్క దాడి చేసింది. రోడ్డుపై కనిపించిన 20 మందికి పైగా కాటు వేసింది. గాయాలైన వారికి చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. పిచ్చి కుక్క కోసం గాలిస్తున్నారు. పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని నిర్మూలించాలని వారు కోరారు. మాజీ ఎంపీపీ షౌకత్ అలీకి కూడా కుక్క కాటు వేయడం విశేషం.

కోహీర్ మున్సిపల్ కమిషనర్‌గా రమేశ్

కోహీర్, మార్చి 20 : కోహీర్ మున్సిపల్ కమిషనర్‌గా కామారెడ్డి మున్సిపల్ మేనేజర్ రమేశ్ గురువారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. కోహీర్ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి ఫిబ్రవరి 28వ తేదీ నుంచి సెలవుపై వెళ్లాడు. దీంతో ఆయన స్థానంలో కామారెడ్డి మున్సిపల్ మేనేజర్ రమేశ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. పట్టణంలోని కార్యాలయంలో విధుల్లో చేరిన రమేశ్‌ను పలు పార్టీల నాయకులు, ప్రజలు ఘనంగా సన్మానించారు.

జవాబుదారిగా ఉండాలి

- కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

వ్యర్థాలను తొలిగిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

పటాన్‌చెరు, మార్చి 20 : జీహెచ్ఎంసీ పటాన్‌చెరు డిప్యూటీ కమిషనర్ సురేశ్ తన తీరును మార్చుకోవాలని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. గురువారం పటాన్‌చెరులో కార్పొరేటర్ మాట్లాడుతూ పట్టణంలో శ్రీహనుమాన్ దేవాలయం వద్ద ఈ నెల 22న 24 గంటల హరి కీర్తన, భజన కార్యక్రమాలున్నాయి. దేవాలయం వద్ద మట్టికుప్పలు అడ్డంకిగా ఉండటంతో ఈ మట్టికుప్పల, నిర్మాణ వ్యర్థాలను తొలిగించాలని పది రోజుల కింద జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ సురేశ్‌కు చెప్పాను. ఇప్పటికి తీయలేదు. ఆ కుప్పలను సొంత ఖర్చులతో తొలిగించినట్లు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ సురేశ్‌కు పారిశుధ్యం, మట్టి కుప్పల తొలిగించాలని సూచిస్తే వాటి ని తొలిగించలేమని, నిధులు లేవని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని మండిపడ్డారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని కార్పొరేటర్ హెచ్చరించారు.

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

మునిపల్లి,మార్చి 20 : సైబర్ నేరాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఐకేపీ ఏపీఎం బాగయ్య సూచించారు. మండలకేంద్రం మునిపల్లిలో మహిళా సంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్‌నేరాలకు అమాయక ప్రజలు మోసపోతున్నట్లు గుర్తు చేశారు. అన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సీసీలు శివయ్య, ప్రభు, మోమన్, నాగమని, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అత్తను కొట్టిన అల్లుడికి రిమాండ్

పుల్కల్, మార్చ